# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 18-01-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ రాష్ట్రంలో త్వరలో మరో 700 అన్న క్యాంటీన్లు ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు.

- ❖ ఆంధ్రప్రదేశ్ సమాచార కమిషన్‌కు చీఫ్ కమిషనర్ సహా.. నలుగురు కమిషనర్లను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది.

- ❖ ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి, మంత్రుల బృందం ఈరోజు దావోస్ వెళ్లనుంది.

- ❖ మూడు వన్డే సిరీస్ ల చివరి క్రికెట్ మ్యాచ్ లో న్యూజిలాండ్.. భారత్ కు 338 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది.

========================

తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని విశ్వవ్యాప్తం చేసిన వ్యక్తి నందమూరి తారక రామరావు అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. అమరావతిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఎన్టీఆర్ 30వ వర్ధంతి సందర్భంగా ఆయనకు ముఖ్యమంత్రి ఈరోజు నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ... బీసీలకు స్థానిక సంస్థల్లో 20 శాతం రిజర్వేషన్లను ఎన్టీఆర్ తీసుకొచ్చారని, మహిళలకు ఆస్తిలో సగం వాటా కల్పించారని తెలిపారు. త్వరలో మరో 700 అన్న క్యాంటీన్లు ప్రారంభిస్తామన్నారు. ఈ ఉగాదికి మరో 5 లక్షల గృహ ప్రవేశాలు కల్పిస్తామని చెప్పారు. దేశంలో వచ్చిన పెట్టుబడుల్లో 25 శాతం ఆంధ్రప్రదేశ్‌కు వచ్చాయని వివరించారు. సూపర్ సిక్స్ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

========================

ఆంధ్రప్రదేశ్ సమాచార కమిషన్‌కు చీఫ్ కమిషనర్ సహా నలుగురు కమిషనర్లను నియమిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ ఉత్తర్వులు ఈరోజు జారీ చేశారు. చీఫ్ కమిషనర్‌గా వజ్జా శ్రీనివాసరావు నియమితులయ్యారు. కమిషనర్లుగా వి.శరత్ చంద్ర కళ్యాణ చక్రవర్తి, గాజుల ఆదెన్న, ఒంటేరు రవిబాబు, పరవాడ సింహాచలం నాయుడును ప్రభుత్వం నియమించింది. మూడేళ్ల సర్వీస్ లేదా 65 ఏళ్లు వచ్చే వరకు ఆర్టీఐ కమిషనర్లుగా పదవిలో కొనసాగుతారని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

========================

పోలవరం జిల్లా దేవీపట్నం మండలం గండిపోశమ్మ అమ్మవారి ఆలయం నుంచి పాపికొండల విహారయాత్ర కొనసాగుతోంది. ఈరోజు గోదావరి నదిపై పాపికొండల అందాలను తిలకించడానికి 14 పర్యాటక బోట్లలో పర్యాటకులు వెళ్లారు. సంక్రాంతి మొదలు నేటి వరకు 15 బోట్లలో సుమారు రోజుకి వెయ్యి మందికి పైగా పర్యాటకులు పాపికొండల విహారయాత్రకు వెళ్లారు. ఈ యాత్రకు సంబంధించిన ఏర్పాట్లను దేవీపట్నం పోలీస్ అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

========================

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని (పి జి ఆర్ ఎస్) రేపు ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ ప్రకటనలో పేర్కొన్నారు. మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అనంతపురం జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో దాఖలు చేసిన తమ అర్జీలు పరిష్కారం కాకపోయినా.. లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. Meekosam.ap.gov.in వెబ్‌సైట్ నందు అర్జీలు నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

========================

సూర్య జయంతి సందర్భంగా ఈనెల 25వ తేదీన తిరుమలలో రథసప్తమి పర్వదినం జరుగనుంది. ఈ సందర్భంగా ఏడు వాహనాలపై స్వామివారు ఆలయ మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమివ్వనున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) ఈరోజు ఒక ప్రకటనలో తెలిపింది. ఈ పర్వదినం కారణంగా ఆలయంలో నిర్వహించే కళ్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవలను రద్దు చేసినట్లు టీటీడీ ఆ ప్రకటనలో తెలిపింది.

విరామం

========================

కేంద్ర ప్రభుత్వ సహకారంతో సేంద్రీయ ఎరువులతో ఎలాంటి రసాయనాలు లేని పంటలను పండిస్తున్నామని చిత్తూరు జిల్లా రైతులు తెలిపారు. సేంద్రియ ఎరువులు వాడకం వల్ల భూసారం పెంచడంతో పాటు అధిక దిగుబడులు పొందుతున్నామన్నారు. మహిళా రైతు రమాదేవి ఆకాశవాణితో మాట్లాడుతూ... సేంద్రీయ ఎరువులపైనే ఎక్కువ శ్రద్ధ పెడుతున్నామని.. కేంద్ర ప్రభుత్వ సహకారం అన్ని విధాలుగా తమకు ఉపయోగపడుతోందని పేర్కొంటూ...

(వాయిస్ 25 సెకన్లు)

========================

ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రులు, అధికారుల బృందం ఈరోజు దావోస్ వెళ్లనుంది. 4 రోజుల పాటు దావోస్‌లో ముఖ్యమంత్రి పర్యటించనున్నారు. రేపటి నుంచి ఈనెల 22వ తేదీ వరకు దావోస్‌లో ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొననున్నారు. మరో కొద్ది సేపట్లో విజయవాడ విమానాశ్రయం నుంచి ఢిల్లీకి, అక్కడి నుంచి జ్యూరిచ్‌కు ముఖ్యమంత్రి వెళ్తారు. దావోస్‌లో తొలిరోజు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఆర్థిక, పర్యాటక విభాగాల మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మర్రితో వివిధ దేశాల మధ్య జరిగే సమావేశంలో ముఖ్యమంత్రి

పాల్గొంటారు. అనంతరం టాటాసన్స్ చైర్మన్ ఎన్. చంద్ర శేఖరన్ ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌తో కలిసి ముఖ్యమంత్రితో సమావేశం కానున్నారు.

========================

పద్మశ్రీ అవార్డు గ్రహీత, ప్రముఖ వైద్యుడు డాక్టర్ ఎస్. వి. ఆదినారాయణ రావు భౌతికకాయానికి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఈరోజు విశాఖపట్టణంలోని గంభీరంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక పార్లమెంట్ సభ్యులు ఎం. శ్రీభరత్ మాట్లాడుతూ... పోలియో వ్యాధిగ్రస్తుల జీవితాల్లో వెలుగులు నింపిన ఆదినారాయణ రావు మరణం సమాజానికి తీరని లోటని అన్నారు. డాక్టర్ గా అయిదున్నర దశాబ్దాల కాలంలో 3 లక్షలకు పైగా ఆపరేషన్లు చేసిన ఆదినారాయణ రావు ను పోలియో వ్యాధిగ్రస్తులకు దైవంగా భావిస్తారని పేర్కొన్నారు.

========================

మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా భారత్, న్యూజిలాండ్ మధ్య మూడవ క్రికెట్ మ్యాచ్ ఇండోర్ వేదికగా జరుగుతోంది. టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 337 పరుగుల స్కోరు చేసింది. డారిల్ మిచెల్ 137, గ్లెన్ ఫిలిప్స్ 106 పరుగులు చేశారు. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా చెరో మూడు వికెట్లు పడగొట్టగా.. కుల్‌దీప్, సిరాజ్‌కు ఒక్కో వికెట్ దక్కింది.

========================

సినీ, రాజకీయ రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిన నందమూరి తారక రామారావు చిరస్మరణీయుడని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఈరోజు నెల్లూరులోని ఆయన విగ్రహానికి మంత్రి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

========================
========================